**అతను** మెట్లు దిగి ఇంటిముఖం పట్టేందుకు సిద్ధం అవుతూంటే జరిగిందా సంఘటన.

''మీరు . . . సంగీతరావు కదా!—''

''అవును!'' అన్నాడు అతను.

ఆ అమ్మాయి చిన్నగా నవ్వింది. ''మీరు ఈ వేళ చాలా అద్భుతంగా పాడారు. ఇంత బాగా పాడే వాళ్ళంటే నాకెంతో అభిమానం. అందుకే ఇలా వచ్చి అభినందిస్తున్నాను!''

''థాంక్స్!''

''మీరు వీలు చూసుకుని ఒక్కసారి మా ఇంటికి టీకి రండి. ఇదిగో ఇది అడ్రసు'' అంటూ పర్సులోంచి ఒక విజిటింగ్ కార్డు తీసి ఇచ్చింది ఆ అమ్మాయి.

పై నుంచి పడుతున్న మెర్క్యురీ దీపాల వెలుగులో ఆ కార్డుమీద అడ్రసు చదవబోయాడతను.

''అన్నట్లు — ఆ కార్డుమీద ఉండేది మా నాన్నగారి పేరు, అడ్రసు — నా పేరు తార. ఇంటి దగ్గర కొచ్చి తార కావాలి! అంటే లోపలికి రావచ్చు!''

''తప్పకుండా వస్తాను!''

''వెళ్ళొస్తానండీ! అన్నట్లు మర్చిపోయా చెప్పటం! సాయంత్రం వచ్చేటట్లయితే ఆరు తరవాతే రండి. నాకు నాలుగింటి నుంచి ఆరింటి వరకు నటరాజ వారి వద్ద డాన్స్ క్లాసెస్ ఉన్నాయి. అన్నట్లు... మీ పేరు సంగీతరావు కాదటకదా!''

''అవును!'' నవ్వుతూ అన్నాడు సంగీతరావు.



# మువ్వల గీతం

పాలకోడేటి సత్యనారాయణరావు

''సొన్నాండి ఏద్దైతేనేం. ఇప్పుడు పేరుకు తగ్గట్లుగానే ఉంది మీ గానం! అన్నట్లు — నా పేరు మాత్రం తారేనండీ. అసలు పేరూ అదే. సొంత పేరు అదే!''

తార వెళ్ళిపోయాక సంగీతరావు— ఆమె కళ్ళల్లోంచి తన కళ్ళల్లోకి దూసుకొచ్చిన మెరుపుల వెలుగులో ఆ కార్డు మీద చిరునామా చదువుకొన్నాడు.

చిరునామా చదవటం పూర్తయ్యేసరికి సంగీతరావు ఒంటిమీద చిరు చెమటలు పోశాయి.

వేలమంది ప్రేక్షకుల ముందు గొంతెత్తి పాడే క్షణంలో సైతం పట్టని చిరుచెమటలు ఇప్పుడెందుకు తన్ను ఆవరించాయి? అనుకొన్నాడు సంగీతరావు.

జవాబుగా అతని కళ్ళముందు తార నిలిచింది.

సంగీతరావుకు భయం వేసింది.

ఆలోచనల్లో తనెంత ఎదిగి పోతున్నాడు! దేశంలో రాని సోషలిజం తన వూహలకు మాత్రం దేనికి? ఎవరు హర్షిస్తారు దాన్ని?

తారా?

తెలీదు.

ఆ సంఘటన జరిగిన చాలారోజులకు సంగీతరావుకు ఒకరోజున మళ్ళీ తార కనిపించింది, చాలా తమాషాగా.

''అబ్బ, మీ కోసమే వెతుకుతున్నానండీ, బాబూ!'' అంది తార సంగీతరావును చూసి సంతోషంగా.

''దేనికి?'' సంగీతరావుకు ఆశ్చర్యం, భయం, ఎక్కడో చిన్న కోరిక! కోరిక నిజం అవుతూందా? తార తన జీవితంలోకి తొంగి చూసేస్తూందా?

తెలీదు.

''ఇరవై తొమ్మిదో తేదీన నా రంగప్రవేశం. మాస్టారు గారికి చెప్పాను — ఎంతైనా కొత్త కదా— కొంత బెరుకు ఉంటుంది. కొంత కొత్త ఉంటుంది. కొంత అలసట ఉంటుంది. అందుకే పాటకూ, పాటకూ మధ్య మీరు పాడితే...!''

''పాటకు, పాటకూ మధ్య మళ్ళీ నా పాట దేనికి? ఆటకూ, ఆటకూ మధ్య అయితే ఫర్వాలేదు!''

''మంచి జోకే కాసీ, వూ అంటున్నారా? మొత్తం నాలుగో అయిదో అయిటములు చెయ్యాలను కొంటున్నాము. మీరో రెండు, మూడు పాటలు పాడితే చాలు. నాకు కొంత రిలాక్సేషన్, ఆడియన్స్‌కు కొంత చేంజి. మాస్టారు వూ అన్నారు, నాన్నగారు నా మాట కాదనరు. ఇక మీరొకరు వూ అంటే —''

''వూ'' అన్నాడు సంగీతరావు.

అరంగేట్రం రోజున తారే బాగా నాట్యంచేసిందో, తనే బాగా పాడాడో సంగీతరావుకు తెలీదు. కొత్త వూపిరి తన పాటల్లోకి చొచ్చుకుని వచ్చింది. అందుకే కొత్త కోయిలలాగా మత్తుగా పాడాడు. ఆడియన్స్‌కు చిత్తుగా తగినంత మైకం కమ్మిన అనుభూతిని కలుగజేశాడు.

చప్పట్లు కొట్టిన ప్రేక్షకులంతా వెళ్ళిపోయారు.

ఎత్తుగా ఉన్న వేదిక మీద అందమైన వెల్వెట్ తెర పడిపోయింది. అది చిన్నగా వీస్తున్న గాలికి అటు ఇటు కదులుతూంది.


వేదికమీద సామాన్లు అన్నీ నౌకర్లు చాకర్లు ఎత్తుతున్నారు. సంగీతరావు వెళ్ళి నటరాజ వారికి నమస్కారం చేశాడు. ఆయన ఆదరంగా ఆశీర్వదించారు.

తార పిలిచింది అప్పుడు—''డాడీ! దిసీజ్ సంగీతరావు మధ్యలోపాటలుపాడారు చూడండి—ఈయనే!'' అని పరిచయం చేసింది.

''ఐసీ. మూడు కదా పాడారు! బాగా పాడారు'' అనటం ఏమిటి, తార తండ్రి జేబులోంచి రెండు వందల రూపాయల నోట్లు తీసి ఇవ్వటం ఏమిటి అంతా ఒకేసారి జరిగాయి.

సంగీతరావు ముఖం చిన్నబోయింది. పాటకు అరవై రూపాయలు. ఆకాశవాణి వారే ఇవ్వటంలేదు! మంచి రేటే కానీ...

వీలు చూసుకుని తార దగ్గర చేరి అన్నాడు సంగీతరావు—''మీ నాన్న రెండు వందలు ఇచ్చారు! కానీ...''



"రెండువందలేం—నేను మూడు వందలు ఇవ్వమన్నానే!"

సంగీతరావు ప్రాణం సగం చచ్చిపోయింది.

"సారీ, అది కాదు నే ననేది! నేను పాడింది ఏదో స్నేహం కొద్దీ, మీ మీద ఇష్టం కొద్దీ. అంతేకానీ—"

తార నవ్వేసింది. "అది తప్పు. ప్రోగ్రాం నాది. అందుకే ఖర్చు అంతా నాదే! ఇష్టం ఉంటే ఇంటికి పిల్చి కప్పు కాఫీ ఇవ్వండి. అంతేకానీ, బిజినెస్ షుడ్ బీ బిజినెస్ వోన్లీ."

సంగీతరావుకు దేశంలో కొన్ని వందల మంది వద్దనే డబ్బు ఎందుకు పోగుపడి పోతూందో తెలిసి పోయింది. వాళ్ళ జీవితాలు వేరు. పథకాలు వేరు. అభిమానాలు వేరు. డబ్బుకీ, దేనికీ లంగరు ఉండకూడదు. వ్యాపారం పరిధిలోకి అభిమానం, ఇష్టం ఏదీ తొంగి చూడకూడదు! అందుకే వీళ్ళ దగ్గరే రూపాయి బిళ్ళలు వంద రూపాయల నోట్లను పొదుగుతూ ఉంటాయి.

సంగీతరావు తేరుకుంటూ అడిగాడు—" ఒక వేళ ప్రోగ్రాం నాదైతే మిమ్మల్ని ఆట ఆడమంటే."

తార నవ్వింది. "అరంగేట్రం రోజున అడిగారు. కాదనను! మీ ఇష్టం వచ్చిన రోజున ఒక పాటకు నేను సిద్ధం!"

"మరి మీకు అప్పుడు నేను రేటు కడితే!"

"ఖచ్చితంగా పుచ్చుకుంటాను. మీ మూడు పాటలకు రెండొందలు ఇచ్చారు కదా! నా ఒక్క ఆటకూ మూడొందలు ఇవ్వండి!"

సంగీతరావుకు చిన్నతనం అనిపించింది.

తను డబ్బుకోసం పాడతాడు. కానీ ఇంతగా ఎక్కడా దోచు కోలేదు. తార ఏమిటి— ఇలా — తననే.

అదీ మొదటి రోజునే —

సరే అదీ కానీ, చూస్తా అనుకొన్నాడు సంగీతరావు.

ఈ సంఘటన జరిగిన ఆరేడు నెలలకు సంగీతరావు వెతుక్కుంటూ తార ఇంటికి వెళ్ళాడు.

గోడ ముందు గేటు వద్ద నిలబడ్డ ఘూర్ఖాను దాటి, లాన్ దాటి, తోట దాటి, పోర్టికోలో తల వంచి మెట్లెక్కి, ఆల్సేషియన్ కుక్కకు దూరంగా నిలబడ్డాడు సంగీతరావు.

నవ్వుతూ పలకరించింది తార.

"మీ రన్నట్లు నేను..." ఆగిపోయాడు సంగీతరావు.

"చెప్పండి!"

"మూడొందలు తెచ్చాను!"

"దేనికీ?"

"మీ ఆటకు...!"

తార పకాలున నవ్వింది. "అబ్బ! బలేగా గుర్తు పెట్టుకొన్నారే!"

"మీరు మాట ఇచ్చారు కదా.."

"మళ్ళీ ఈ సంకెళ్ళేమిటి?"

"ఇచ్చిన మాట సంకెళ్ళే మరి! పైగా నే ప్రోగ్రాం ఫిక్స్ చేసేసుకున్నాను కూడాను. మీరు వూ అంటే!"

"సరే కానివ్వండి. ఎప్పుడు ఇంతకీ డేట్?"

"ఆరో తేదీన—రోజున నా పుట్టిన రోజు—అదుకే!"

"గుడ్. అయితే సరి. ఒప్పుకుంటున్నాను!"

"ఒకటే షరతు—మీ అమ్మా,నాన్నగార్లకు చెప్ప కూడదు. ఆఖరికి మీ ఘూస్టారుకి కూడా..."

"అదేమిటి? మరి వాళ్ళకు చెప్పక పోతే ఎలాగ? వాద్యాలు, పాడేవాళ్ళూ కనీసం వాళ్ళకైనా చెప్పాలా, వద్దా?"

"నాకు అడ్రసు ఇస్తే నేనే చెప్పి వస్తాను వాళ్ళకు. ఎరేంజి చేయిస్తా."

తార ఏమనుకుందో వూ అంది. తరవాత ఆరు రోజులకు సంగీతరావు తారను తీసుకెళ్ళాడు.

చిన్నగది. ఒక మూల మంచం. మరో పక్క చిన్న చాప. చాపకు ఒక పక్క మడిచి ఉంచిన బొంత. బొంతకు పైన అలమారులో పుస్తకాలు. మంచానికి పైన కర్రల ఆలమారులో సీసాలు. సీసాల్లో అడుగున ఉన్న ఆవాలు, ఇంగువ, మిరియాలు, మిరప కాయలు... కింద చిల్లుపడే ఉంటుందన్నవిధంగా ఉన్న స్టౌ...

"ఇదేమిటిది?" అంది తార.




ముందంజవేస్తున్న ఉజ్వల కాంతులలో ...

ఈ దీపావళికి
మీ సంతోష సౌభాగ్యాలు
సిద్ధించాలని కోరుతున్నాం

ఈరోజే మావద్ద ఒక క్రొత్త అకౌంటును తెరచి
శుభ కార్యాలను జయప్రదం చెయ్యండి.

అలహాబాద్ బ్యాంక్
(గవర్నమెంటు ఆఫ్ ఇండియావారి సంస్థ)

U-AB-10 TEL

"మా ఇల్లు. అది అంటే ఆ మంచం. అటు వైపున ఉన్న మిగతా సామాను అంతా మా రూమ్మేటు రామ్మూర్తిది. ఇటువైపు నాది!... కూర్చోండి!" అన్నారు సంగీతరావు.

"కూర్చోటం ఏమిటి? వెళ్ళొద్దు!...అన్నట్లు వాళ్ళంతా ఏదీ?... ఏకంగా స్టేజి మీదకే వచ్చేస్తారా?"

"ఒక్కక్షణం" అంటూ సంగీతరావు మంచం ఎత్తేశాడు. మంచం కింద ఉన్న పెట్టెను ఒక పక్కకు ఈడ్చాడు. ఆ పెట్టెకు ఉన్న తాళం తీసి అందులోంచి టేప్ రికార్డర్ తీశాడు. అది ఒకచోట మూల పెట్టి, మరోవైపంతా సర్దేశాడు.

"ఇది స్టేజి! ఇది . ." టేప్ రికార్డర్‌ను ఆన్ చేస్తూ — "మీరు అడిగిన వాద్యబృందం, పాటగాళ్ళు అందరూ ఇందులోనే ఉన్నారు." ఇక ఆడండి!" అన్నాడు సంగీతరావు.

"అంటే . . .?" అంటూనే తార పకాలున నవ్వేసింది.

"మీరు మాట ఇచ్చారు. పైగా ఈ రోజున నా పుట్టినరోజు"

తార చీర ఎగకట్టి నృత్యం మొదలు పెట్టింది.

పాట పూర్తవగానే ఆపి, "ఇదే ఇంకోరైతే, ఇలా చేసినందుకు లాగి లెంపకాయ కొట్టేదాన్ని" అంది. 'మీ పుట్టిన రోజని అన్నారని, మీకు మాట ఇచ్చానని పూ అన్నాను" అని అంది.

సంగీతరావు నవ్వాడు. "పోనీండి. ఇదిగో మూడొందలు!" అంటూ అందించారు.

"ఇది మీ రూమేనా? కాకపోతే మీ పేరు లాగనే ఇది నటనేనా?"

"నిజం. ఇదే మా రూం. నా పేరు ఖాదర్. కానీ, ఖాదర్ అనేవాడు సంగీతం పాడితే ఒప్పుకొనే సహృదయం మనకు ఉండదు. అందుకే సంగీత రావు అని పేరు పెట్టుకొన్నా."

"అదేం మాట—బిస్మిల్లాఖాన్ లేరూ మనకూ! మహమ్మద్ రఫీ లేరు. కళలకు అలాటి భేదాలు ఉండవు. ఉండకూడదు —" అంది తార. లేచి నిల బడుతూ అంది— "మరి నేను వెళ్తాను!"

"కళలకు ఏ భేదాలు ఉండకూడదా?"

"ఉండకూడదనే అన్నా కదా!"

"అంటే కులం, మతం, జాతి వగైరా ఏవీ . . .?"

"అసలు ఏవీ ఉండకూడదు!"

"అంటే బీదరికం కూడా కళలకు...!"

"అది వేరు. లక్ష్మి — సరస్వతి ఉండే చోట ఉండదుట! అందుకే డబ్బు ఉండేవాళ్ళకు కళల పట్ల ఆసక్తి కూడా ఉండదు!"

"మరి మీ విషయం?"

"ఇది వేరు. నేను మామూలు రూల్స్‌కి ఎక్సెప్షన్."

"జీవితంలోనూ కాకూడదూ?"

"అంటే?"

"తారా! నన్ను పెళ్ళి చేసుకోకూడదూ?' అనడిగాడు.

తార పొంగిపోలేదు.

క్షణం ఆగి అంది — "మీ రిది అంటారని నాకు తెలుసు. ఇంతకాలం అనకపోవటమే ఆశ్చర్యంగా ఉంది."

"ఎందుకు అనిపించింది మీకు ఇలా?" అనడిగాడు సంగీతరావు.

"కారణాలు చాలా ఉన్నాయి. మొదటిది నా అంతట నేను వచ్చి మిమ్మల్ని అభినందించటం. రెండోది, నా అంతట నేనే వచ్చి మీ పాట కోరటం. ఈ రెండూ చాలు—నాకు మీ పట్ల ప్రేమ ఉందని మీరు అనుకొనేందుకు!"

"ఉందని అనుకోవటం ఏమిటి...లేదా?"

తార నవ్వింది. "ఎందుకు ఉంటుంది చెప్పండి! మీరు నా కన్నా దేంట్లో గొప్ప? అన్నిటిలోనూ నాకన్నా బీదవారు. నాకన్నా అంటున్నాను. గుర్తుంచుకోండి!"

"అంటే . . . నేనంటే మీకు ఇష్టం కానీ, అభిమానం కానీ . . . ఏవీ లేవా?"

"లేకేం? లేవనటం తప్పు. ఉన్నాయి. మీరంటే బోలెడంత ఇష్టం ఉంది. మీ పాట లంటే చెప్పలేనంత అభిమానం ఉంది. కానీ పెళ్ళి.. పెళ్ళి చేసుకొనేంత లేవు! ఎందుకంటే!" ఆగిపోయింది





❊ నూతన యవ్వనం పొందండి ❊



జీవితములో పోగొట్టుకున్న యవ్వనము నరముల బలహీనతలను తిరిగి పొందుటకు ఇతర చికిత్సల వలన ప్రయోజనము పొందక విసుగుచెందినవారు సంపూర్ణ సుఖము పొందుచున్నారు

*భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన*

**కవిరాజ్. డా॥ డి. హనుమంతరావు (L.I.M.S)**

మహంకాళీ వీధి. సికింద్రాబాదు.

సలహాఫీజు 10 రూ॥లు, మందుల చార్జీలు ప్రత్యేకం.

సంప్రదించువేళలు:

ఉదయం 8 నుండి 12 వరకు, పగలు 3 నుండి 7 వరకు.

ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

**ప్రతి నెల 4,5 తేదీల్లో విశాఖపట్టణం హోటల్ డాల్ఫిన్ డాబాగార్డెన్స్‌లో క్యాంపుకలదు**

తార.

"చెప్పు! ఏమీ అనుకోను. చెప్పాల్సిన దేదు నిజం చెప్పేశావు. ఇప్పుడిచ్చే దంతా వివరణే కాబట్టి నొచ్చుకోవాల్సింది ఏమీ లేదు! చెప్పు!"

"చెప్పమంటున్నావ్ కాబట్టి చెప్తున్నాను. పుట్టిన రోజు నుంచీ నేను పువ్వుల్లో పెరిగాను. అడుగుతీసి అడుగువేస్తే ఎక్కడ నా కాలు కందిపోతుందోనని మా నాన్న నా కోసం ఇల్లంతా పట్టు తివాచీలు పరిపించాడు. ఆకాశంలో ఎగిరే విమానం కావాలంటే అరక్షణంలో కొని నా ముందుంచే తాహతు మా నాన్నకు ఉంది. చిన్నతనం నుంచీ నాది మంకుపట్టు — కోరుకునేది అందుకోవటం నా స్వభావం! నిన్నుమల్ని పెళ్ళి చేసుకుంటే — ఏం బావు కొంటాను నేను? ఏం సుఖపడతాను నేను? ఇక్కడ గట్టిగా కాలు పెట్టటానికి సరిపడేంత స్థలమే లేదు. ఈ రోజు ఇప్పటికిప్పుడు ఒక పూట అన్నం తింటా నంటే మీరు వరసగా ఆరేడు సార్లు బజారుకెళ్ళి సామాన్లు తెచ్చుకోవాలి. ఇంత కటిక దరిద్రంలోనా అడుగు పెట్టేది నేను. నా కది నచ్చదు. చెప్పా కదా— నేను లక్ష్మీ పుత్రికను. ఇక్కడ సరస్వతి తప్ప లక్ష్మీ నివసించదు. నాకు ఇక్కడ స్థానం వద్దు!"

తార అనేదంతా సావకాశంగా విన్నాడు సంగీతరావు.

ఇంట్లోకి—అదే తన గదిలాంటి ఇంట్లోకి తొంగి చూసుకున్నాడు. తార అన్న దాంట్లో తప్పేమీ లేదు. అన్నీ ఆమె అంటున్నట్లే ఉన్నాయి. గట్టిగా కాలు జాపి కూర్చుంటే రూమ్మేట్ రామ్మూర్తి వాటాలోకి కాలు వెళ్ళిపోతూంది. ఇక్కడ తనకు ఇరుకు అని చెప్పింది తార. అసలు తారకనే ఏం— తనకే అలా ఉంది ఇప్పుడు! ఇలాటి ఇరుకు గదిలో ఎలా ఉండ గలుగుతున్నాడు తను?

"తారా! ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. నా కో అయిదేళ్ళు టైం ఇయ్యి. నేను నీ అంత ఎత్తుకు ఎదుగుతాను. ఎలా అని అడగకు. నీ ఎత్తుకు ఎదిగాక నీ కోసం వస్తాను, నీ కోసం పట్టు తివాచీలు పరిపిస్తాను, ఒంటి స్తంభంమేడ కట్టించి, అందులో నీ కోసం స్వర్గాన్ని దింపి ఉంచుతాను. కానీ అంత ఎత్తుకు ఎదిగేందుకు నా కో అయిదేళ్ళ టైం ఇయ్యి. నీ చెయ్యి పట్టుకొనేందుకు అవకాశం ఇయ్యి!"

తార నవ్వింది. "ఎలా ఎదుగుతావ్ ఆ ఎత్తుకు. పాటలు పాడా?" అనడిగింది అమాయకంగా ముఖం పెడుతూ.

"అవును. నా పాటల్లో నీ ప్రేమ నింపుతాను. నీ మీది కోరిక పెంచుకుంటూ పాటల్లో అందం పొదుగుతాను, ఆ పాటలతో కోట్ల కొద్దీ రూపాయలు నా సొంతం చేసుకుంటాను."

తార మళ్ళీ నవ్వింది. "మేఘమల్హార్ రాగం పాడితే మేఘాలు వర్షిస్తాయని తెలుసు. కానీ, ఇలా కనక వర్షం కురిపించగలిగే రాగం ఏదీ ఉన్నట్లు నాకు తెలీదు" అని క్షణం ఆగి అంది మళ్ళీ తనే— "పిచ్చి ఖాదరూ! నీకు సంగీత జ్ఞానమే తప్ప లోక జ్ఞానం లేదు. రూపాయి సంపాదించే వాడికి మహా అయితే మరో రూపాయి లభిస్తుందే తప్ప కోట్లు వచ్చి కుప్పలు కావు. అయిదేళ్ళు అంటున్నావు నువ్వు! అయిదేళ్ళు కాదు—అయిదు దశాబ్దాలయినా నువ్వు నా ఎత్తుకు ఎదగలేవు. అయినా సరే, ఒక మాట! నన్ను కోరిన వాడివి—జీవితంలో మర్చిపోను. నువ్వు ఎక్కడున్నాసరే, నీ అడ్రసు మాత్రం తెలియజేస్తూ ఉండు. నా పెళ్ళికి వద్దువుగాని, శుభలేఖ పంపిస్తాను" అంది తార, ఆఖరు మాట అదే నన్నట్లు.

సంగీతరావు మనసు గాయపడింది.

ఆడది—అన్నరాల్ ఆడది—ఆడతనంతప్ప ఇంకే ధనమూ సొంతంగా సంపాదించుకోలేని ఈ ఆడది తనను వేళాకోళం ఆడుతూంది. జీవితంలో నువ్వు నిక్కచ్చిగా ఎదగలేవని చెప్తోంది.

కాదు. తన కిదో చాలెంజి! ఎదిగి, ఎదిగి — ఇంతై, అంతై... భూనభోంతరాల కల్లంతై అన్నట్లు ఎదుగుతాడు తను. సంగీతమే తనను ఆ ఎత్తుకు చేర్చుతుంది.

కోరుకున్న ప్రేయసి తోసి రాజన్నది కానీ, కన్నతల్లిలాటి సంగీతం తనను కాదనదు. తనకు బాసటై నిలిచి, తనను అంతస్తుల్లోకి చేర్చుతుంది అనుకొన్నాడు సంగీతరావు.

అందుకే తార వెళ్ళిపోతూంటే సంగీతరావు ఏమీ అనలేదు. మౌనంగా తన జీవితంలో భవిష్యత్తుకు వీడ్కోలు చెప్తున్న అనుభూతితో ఉండిపోయాడు.

ఎంత చిత్రం — రేపు రావాల్సిన జీవితానికి ఈ రోజు తను వీడ్కోలు పలకటం! అనుకొన్నాడొకసారి సంగీతరావు.

• • • •

"డాడీ! ఒక చిన్న రిక్వెస్ట్" అంది తార గారంతో.

"చెప్పమ్మా!" అన్నారు కృష్ణారావు, ఆయనకు తారను చూస్తూంటే ముచ్చటగా ఉంది. మనసంతా పండగలా ఉంది. మొన్న పుట్టిన పాపాయి. చిన్న గౌన్లతో తిరిగిన పసిపాప, ఈనాడు చీర కట్టుకొని కళ్ళముందు నిలబడింది. అంత ఆనందం ఆయనకు ఎప్పుడూ కలగనే లేదు గతంలో!

"ఏమీ అనకూడదు, డాడీ, మరి!... నా పెళ్ళి ఇంకో వారం ఉందనగా, మనదేశంలో వస్తున్న అన్ని దినపత్రికల్లోనూ నా ఫోటో వేసి, పెళ్ళివార్త ప్రచురించాలి" అంది తార.

కృష్ణారావు నవ్వేశారు. "నిజమే సుమా! ఆ సంగతే ఆలోచించ లేదు నేను. నా ఒక్కగానొక్క కుమార్తె పెళ్ళి అని నేనే చాటింపు వేసి చెప్పాలి. గుడ్! నువ్వే ఇచ్చావు గుడ్ అయిడియా. అలాగే చేద్దాం."

మర్నాడు పేపర్లన్నింటిలోనూ తార ఫోటో ఒకటి, పక్కనే పెళ్ళి వార్త ప్రచురితమయిపోయింది.

ఎక్కడో జరిగే పెళ్ళికి ఇక్కడ ప్రకటన దేనికి అనుకొన్నారు దేశంలో పలుమూలల్లో ఉన్న జనం, ఆ ప్రకటన చూసిన జనం.

కానీ సంగీతరావు అలా అనుకోలేదు. ఆ ప్రక



టన తనకే నని అతనికి తెలుసు. తారకు ఇంకా తను గుర్తున్నాడన్నమాట. అది తన మొదటి విజయం. తారకు పెళ్ళి అవుతూంది. ఆ సంగతిని తార తనకు స్పష్టంగా తెలియజేస్తూంది. ఇప్పుడు ఇక తను తెలియజేయాల్సి ఉంది.

తల్చుకొంటే తను ఈరోజు తార అడిగితే కొని ఇవ్వటం కాదు. తార అడగక మునుపే కొని తీసుకెళ్ళగలడు ఆకాశంలో ఎగిరే విమానాన్ని. ఆ విమానానికి కుక్క గొలుసు వేసి కట్టేసి మరీ తారకు అందించ గలడు తను. ఆ సంగతి చెప్పేందుకు తాను పెళ్ళికి వెడతాడు. వెళ్ళి . .

చార్టర్డ్ విమానం రన్‌వేకు చివర్న ఆపివేశారు. అ దక్కడకు చేరి అప్పుడే రెండు రోజులయింది. వారంరోజులకు సరిపడేంత అడ్వాన్స్ కట్టేశారు కాబట్టి ఆ విమానం గురించి పట్టించుకోవటం లేదు.

ఇటు సంగీతరావు పరిస్థితి అలాగే ఉంది. అతను అక్కడ నిలబడి ఆరు గంటలయింది. అతని గురించీ ఎవరూ పట్టించుకోవటం లేదు. తన నెవరూ పట్టించుకోవటం లేదన్న విషయాన్ని ఇటు సంగీతరావు పట్టించుకోవటం లేదు.

అప్పుడొచ్చాడు ఎదురింటి గోడ పక్కన పాన్

షాప్ పెట్టుకొన్న వ్యాపారి. "ఏం కావాల, బాబు, మీకు?"

సంగీతరావు నవ్వాడు. జవాబు ఇవ్వాలా వద్దా అని ఆలోచించాడు. ఇవ్వకూడదనే నిర్ణయించుకొన్నాడు.

ఆ వ్యాపారి క్షణం నిలబడి వెళ్ళిపోయాడు.

సంగీతరావు అలా నిలబడే ఉన్నాడు.

కృష్ణారావు ఇంట్లోంచి కారొకటి రివ్వున దూసుకుంటూ వెళ్తూ వెళ్తూ— రివర్స్‌గేర్‌లో పడి మళ్ళీ వెనక్కు వచ్చింది. ఆ కార్లో వెనక సీట్లోంచి తార, తల బయటకు పెడుతూ ఉలికి పడింది — "నువ్వు . . మీరు ... సంగీతరావు కదా!"

సంగీతరావు నవ్వాడు.

"ఇక్కడ నిలబడ్డారేం? లోపలికి రావాల్సింది. రండి." అంది కారు-డోర్ తెరుస్తూ.

సంగీతరావు నవ్వాడు. "తారా! నీ పెళ్ళి ఆహ్వానం అందింది."

"పెళ్ళికి వచ్చిన వాళ్ళు లోపలికి రావాలి కానీ, ఇక్కడ ఉండిపోతారా?" అంది చిలిపితనంతో తార.

"పెళ్ళికి రాలేదు నేను! నేను పెళ్ళిచేసుకొనేందుకే వచ్చాను నిన్ను...!"

"స్టుపిట్! ఎవరైనా వింటే నవ్విపోతారు. నీతో నాకు పెళ్ళేమిటి? చెప్పాగదా! నువ్వు ఏడు జన్మలెత్తినా నా సరి పోలవు!"

సంగీతరావు నవ్వాడు. "ఎందులో—డబ్బులోనా? అంతస్తులోనా? ఆస్తిలోనా? దేంట్లో?"

"అన్నిటిలోనూ! ఇది అని వేరే చెప్పనక్కర్లేదు!"

"తారా! పొరబడుతున్నావ్. ఈ రోజు మీ అంతస్తు ఏమిటో నీకు తెలుసుకానీ, అది నా కాలి గోటికికూడా సరిపోలదని నీకు తెలీదు. యూ నో వాట్ ఐ యామ్?" అంటూనే జేబులోంచి పర్సు తీశాడు సంగీతరావు. పర్సులోంచి వంద రూపాయిల నోట్లు తళతళా అంటూ మెరుస్తున్నాయి. ఆ నోట్ల గురించి సంగీతరావు పట్టించుకో లేదు. "ఈ వూరు నాది కాదు. నేను ఇప్పుడిక్కడ ఉండటం లేదు. అయినా ఇదిగో! ఇవి చాలు, నేనేమిటో చెప్పేందుకు? ఈ క్రెడిట్ కార్డ్స్ అన్నీ నా గురించే చెబుతాయి. ఇవి ఇలా చూపిస్తే అలా కనీసం అర లక్ష వరకూ నేను ఇలా చిటికెల మీద తెప్పించ గలను తెలుసా?" అన్నాడు సంగీతరావు. అతని చేతిలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్. వీసా, డైనర్స్‌క్లబ్ ఆంధ్రా బాంకార్డ్ అన్నీ వరసగా ఉన్నాయి.

తార నివ్వెరపోయింది. అయినా తేరుకొంది.

"ఇవన్నీ నీవే? నిజం?" అంది వేదాకోళంగానే.

"పోనీ, వూ అను—నిన్ని క్షణం తీసుకెళ్ళిపోతాను నా సొంత ప్లేన్‌లో! నమ్మవేమో? వెళ్ళు ఫోన్ చేసి చూడు ఎయిర్‌పోర్ట్‌కు. నా విమానం అక్కడ ఉందో లేదో?"

తార ఉలికి పడింది. అంటే?

"ఆ నిజమే! ఈ రోజు మీ నాన్న గత పది తరాలు శ్రమించి సంపాదించి పెట్టిన ఆస్తినంతా నేను ఈక్షణంలో కాష్—హార్డ్‌కాష్ ఇచ్చి కొనగలను. ఇక అంతస్తు లంటావా? ఏది, అదిగో ఆ రెండంతస్తులమేడ—అంతేకదా! నాకు విక్టోరియా టెర్మినస్ వద్దే ఆరంతస్తుల భవంతి ఉంది. చాలా? ఇంకా నీకు, మీనాన్నకూ మరో పదేళ్ళకుకూడా ఆలోచించుకునే అర్హత సైతం లేనంత కీర్తి ప్రతిష్ట లున్నాయి. ఇప్పుడంటే ఇప్పుడు ఇంట్లోకి వెళ్ళి రేడియో పెట్టి, ఏ స్టేషనయినా సరే పాటలు విను. ఈమహ్మద్‌ఖాదర్ పాడిన పాటలువినిపిస్తాయి!"

తార తల తిరిగి పోయింది. మహ్మద్‌ఖాదర్ అంటే ఈ ఖాదరా? ఈ సంగీతరావా?"

అయినా ఇప్పుడేం లాభం?

తనకు పెళ్ళి సెటిలయి యింది. సెటిలవటం ఏం ఖర్మ—ఇంకో రెండు రోజుల్లో పెళ్ళికూడా అయిపోతూంది. ఇప్పుడు—ఈ సంగీతరావు ఇలా ఇప్పుడు, ఇక్కడ ప్రత్యక్షమయినా. . .

ఏమిటో. పొరబాటు జరిగిందా? తెలీటం లేదు.

అయినా ఇప్పుడు సరిదిద్దుకోవటం జరిగే పని కాదు. ఇక మిగిలింది సరదాగా నవ్వుకోవటం? తెలిసో తెలియకో తను అప్పుడి సంగీతరావు సీరియస్‌గా తీసుకున్నాడు ఈమేలే జరిగింది దానివల్ల!

"మంచిది! మీ రింత బాగుపడ్డారని విని,



కళ్ళారా తెలుసుకుని సంతోషిస్తున్నాను. రండి, లోపలికి'' అంది మళ్ళీ తార.


సంగీతరావు నవ్వేశాడు''"తారా! ఒక్కటి చెప్పనా? ఇంత కష్టపడింది, ఇంత సంపాదించింది సంతోషం కోసం కాదు. నువ్వు నా దానివైతే అప్పుడు సంతోషించటానికి. చెప్పు. నన్ను పెళ్ళాడతావా?''

తార నవ్వింది. ''మంచి జోకే! ఇప్పుడేమిటి? నాకు పెళ్ళి సెటిలయి పోయింది.''

''సెటిలయింది నీకు కాని నాకు కాదు కదా?''

''అయితే మాత్రం. ఆడపిల్ల పెళ్ళి ఆగిపోతే? అదీగాక మా నాన్నగారి పరువు.''

''ఈ ఆడపిల్ల పెళ్ళి ఆగిపోతే, మళ్ళీ చేసుకునేందుకు నేను రెడీ! కనక దాంట్లో నష్టం లేదు మీ నాన్నగారి పరువుకు నష్టం వస్తే, ఎంతో చెప్పు? పరిహారం పడేస్తాను—ఇక మగపెళ్ళి వారి కంటావ్? వాళ్ళకు మాత్రం అకారణంగా జరిగిన ఇబ్బందికి మనసా క్షమాపణ చెప్పుకుంటాను.''




''బాగుంది అయిడియా! కాని, ఇవన్నీ జరిగేవి కావు. నా మాట విను. ఈ పంతం వదిలెయ్. పెళ్ళికి వచ్చిన మాజీ ప్రియుడవు. నాలుగు అక్షింతలు వేసి వెళ్ళు. నేనూ సంతోషిస్తాను. నువ్వూ సంతోషిద్దువు కాని!''

''కుదరదు. నే నిక్కడి నుంచి కదిలేది కేవలం నీతో పెళ్ళి కోసమే!''

''అది జరగదంటున్నా కదా?''

''చూద్దాం. ఎందుకు జరగదో.''

''పోనీ, నాకే ఇష్టం లేదంటే?''

క్షణం ఆలోచించాడు సంగీతరావు. ''అనుకున్నాను. ఈ ప్రశ్న వేస్తావని. కానీ, నాకు తెలుసు—నీకు ఇష్టం ఉందని. నీకూ, నాకూ అంతస్తుల తేడా ఉందన్నావే కానీ, నాకు ఇష్టం లేదని ఆ రోజు చెప్పలేదు నువ్వు. నీ కిష్టం లేదని ఆ రోజు నువ్వు అని ఉంటే ఈ రోజున ఇలా అనేవాడిని కాను. ఇలా అయ్యేవాడినీ కాను. మంచికో, చెడుకో ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇంక దానికి తిరుగు లేదు!''

''అంటే ఏం చేస్తావ్?''

''ఏమీ చెయ్యను. ఇక్కడ ఇలాగే ఉండి పోతాను.''

''నేను రాకపోతే?''

''ఇప్పుడు మాత్రం పిలిచానా, నువ్వే వచ్చావు. అప్పుడూ అంతే!'' సంగీతరావు నవ్వాడు.

''అంటే ఏమంటారు దాన్ని. ఆ మరణ నిలబడు దీక్ష అనేనా దీన్ని!''

''ఆ మరణ కాదు. ఆ వివాహ అనాలి. నీతో వివాహం వరకే ఈ దీక్ష!''

''అది జరగదు'' అంది తార. కారు డోర్ వేసేసింది. ''డ్రైవర్! పోనీ'' అంది.

కారు కదిలింది. సంగీతరావ్ అలాగే నిలబడి ఉన్నాడు—కార్లోంచి తార టాటా చెబుతున్నా బదులుగా చెయ్యి ఊపక.

అరగంట తరవాత తార తిరిగొస్తూ అటుకేసి చూసింది. అక్కడ సంగీతరావు అలాగే ఉన్నాడు. నవ్వుకుంది. తన కోసం ఒకడు ఇలా తన ఇంటి ముందు పడిగాపులు కాయటం తారకు తమాషాగా అనిపించింది. గర్వంగా తోచింది. విచిత్రంగానూ తోచింది.

'కానీ, డాడీకి తెలిస్తే?'

రాత్రికి తెలిసిపోయింది కృష్ణారావుకు. ''ఏమిటమ్మా అది—డ్రైవర్ చెప్పింది నిజమేనా?''

చిన్నతనంనుంచీ అబద్ధం చెప్పి ఎరగదు. ఇప్పుడూ చెప్పలేదు తార. ''నిజమే!''

''అంటే ప్రకటన వేయించి పిలిపించావన్న మాట ఆ రాస్కెల్‌కు!''

''అదేమిటి, నాన్నా, అలా అంటారు, హి లైక్స్ మీ సోమచ్! అయినా ఇదో తమాషాగా లేదూ?'' అంది తార.

''తమాషాగానా? ఎంత తలవంపులు. రేపు మగ పెళ్ళి వారొస్తే, వాళ్ళకు ఈ సంగతి తెలిస్తే ఎంత గొడవ అవుతుందో చెప్పు! నో.నో. యు కాంట్ జస్ట్ సిట్ అండ్ స్టేర్ ఎట్ హిజ స్టాండింగ్ లైక్ దట్! అత నలా అక్కడ నిలబడి ఉంటే ఇక్కడ మనం చేతులు కట్టుకుని చూస్తూ వూరుకుండి పోలేం! చెబుతాను. అతనికి నా సంగతి తెలియజేస్తాను. ఎవరనుకుంటున్నాడో, ఏమో'' అన్నారు కృష్ణారావు.

తార నవ్వింది. ''డాడీ! అతనికి సంగతి ఏమో కానీ, అతని సంగతి మీరు తెలుసుకోవటం మంచిది. అతను మహ్మద్‌ఖాదర్ అని గొప్ప గాయకుడు. రేడియో పెడితే చాలు మీకు వినిపించేది అతని పాటే. టీవీ ఆన్ చేస్తే మీకు కనిపించేది అతని బొమ్మే.''

''మహ్మద్‌ఖాదరో, మహ్మద్ గజినీయో ఎవరైతే నేం నాకు అనవసరం. నా ఇంటి ముందు అల్లరి చేసేవాడు గాయకుడైనా, నాయకుడైనా సరే, నాకది న్యూసెన్సే! ఒప్పుకోను, నే నిది చస్తే ఒప్పుకోను. శుభమా అని పెళ్ళి చేసుకుంటూంటే ఇంటి ముందు ఇదేమిటమ్మా ఈ గొడవ? నో నో.'' అన్నారు కృష్ణారావుగారు. క్షణం ఆగి అన్నారు ఆయనే మళ్ళీ ''ఇప్పుడే వెళ్ళి పోలీసులకు ఫోన్ చేసి చెప్పేస్తా.''

''డాడీ పోలీసుల దాకా దేనికి? అతనూ గొప్పవాడే. పోలీసులు అతన్ని ఏమంటారని నేను అనుకోను. పైగా చేస్తున్నదీ ఏముందీ? అసలు నన్నడిగితే మీరే వెళ్ళి అతనితో మాట్లాడి వస్తే మంచిదని నా అభిప్రాయం.''

''అంతేనంటావా?'' అన్నారు కృష్ణారావు.

అంతేనంది తార. కృష్ణారావుగారు కదిలారు: 'రాజా వెడలె' అన్నట్లుగా కాక, కేవలం మారు వేషంలో దేశంలో ప్రజల కష్టనష్టాలు తెలుసుకోవడానికి వెళ్ళే రాజుగారిలాగ రహస్యంగా కదిలారాయన. నౌకర్లకు, చాకర్లకు చెప్పకుండా మరీ కదిలా రాయన.

వెళ్ళి నెమ్మదిగా సంగీతరావు చెంత చేరారు కృష్ణారావు. నయాన చెప్పారు—ఈ పట్టు విడిచిపెట్టమని. బతిమాలారు తన కూతురి పెళ్ళి సజావుగా జరిపించమని. ఇంత కాలం ఇంట్లో ఉన్న పరువును బయట పెట్టొద్దని కోరారు.

సంగీతరావు అంతా విన్నాడు. చివరకు ఒకటే అన్నాడు: ''ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. మీ అమ్మాయిని అడగండి—నే నంటే ఇష్టం లేదా అని. ఉందని తెలిస్తే మీరే ఆలోచించండి. మీ అమ్మాయి కోసం ఏళ్ళ పాటు నిలిచి తపస్సు చేయడానికి సిద్ధంగా ఉన్న వాడిని, నా కిచ్చి పెళ్ళి చేస్తే మీ అమ్మాయే సుఖ పడుతుందన్నది గుర్తించండి. ఒకవేళ నాకు ఖాదర్ ఇష్టం లేదని మీ అమ్మాయి అంటే ఆ సంగతి నా ముందు చెప్పించండి. తల వంచుకుని వెళ్ళిపోతాను. ఆ తరవాత మీ అమ్మాయి పెళ్ళి మీ ఇష్టం! మీ అమ్మాయికి ఇష్టం ఉందంటే మాత్రం పెళ్ళి తరవాత నే నిక్కడి నుంచి కదిలేది గుర్తుంచుకోండి.''

కృష్ణారావు ఇంట్లోకి వచ్చేశారు. సంగీతరావు చెప్పేదాంట్లో సబబు ఉందనిపించింది. కానీ, ఇన్ని ఏర్పాట్లూ చేసుకుని ఇప్పుడు పెళ్ళి కొడుకును

మార్చటం అంటే ఎంత పరువు నష్టం! అదిమాత్రం కుదరదు. సంగీతరావుకు చెప్పగలగటం కష్టం కనక కన్నకూతురికే నచ్చ చెప్పా లనుకున్నాడు.

''అమ్మాయ్! అతను అలా అంటున్నాడు కనక ఒక్కటె—ఒక్కటంటే ఒక్కటే ఒక్క అబద్ధం చెప్పేసెయ్. అతని ముందుకు వెళదాం. 'నాకు నువ్వు ఇష్టం లేదు' అని ఒకే వాక్యం చెప్పేసెయ్. గొడవ వదిలిపోతుంది'' అన్నారు కృష్ణరావు సలహా ఇస్తూ.

తార నవ్వింది. ''డాడీ అబద్ధం చెప్పటం అలవాటు లేని దాన్ని. మీ దగ్గర అబద్ధం చెప్పను. అయిదేళ్ళ క్రితం నాకు అతని పాటలంటే మోజు ఉండేది. బాగా పాడతాని అభిమానం ఉండేది. కాని, ఇప్పుడు అతనంటే ఇష్టమూ ఉంది. ఇష్టం లేదని అబద్ధం చెప్పటం నా వల్ల కాని పని. అతన్ని నచ్చ చెప్పి పంపె య్యండి కానీ, నా చేత అబద్ధం చెప్పించకండి. అతను వెళ్ళి పోతే, నేను ఈ పెళ్ళికి రెడీయే.''

కృష్ణారావు నివ్వెరపోయారు. అయినా, కూతుర్ని ఏమీ అనలేక పోయారు. మవునంగా తన గదిలోకి వెళ్ళిపోయారు.

పుస్తకం చదువుతూ, చదువుతూ నిద్ర పోయిన కృష్ణారావుకు పెద్ద చప్పుడుతో మెలుకువ వచ్చింది. ఉన్నట్టుండి కళ్ళు చెదిరాయి. గదిలో కర్టెన్లు రివ్వు మని ఎగురుతున్నాయి. కిటికీ తలుపులు కొట్టుకుంటు న్నాయి. ఆకాశంలోంచి ఉరుముల చప్పుడు అదటు పుట్టిస్తున్నాయి. కృష్ణారావు లేచి పుస్తకం పక్కన పడేసి, కిటికీ తలుపులు వేసేందుకు అటు కదిలారు. కర్టెన్లు పట్టుకుని కిటికీ రెక్కల్ని వేస్తూంటే మెరుపొకటి మెరిసింది. ఆ మెరుపుకు ఇంటిముందున్న సంగీతరావు కృష్ణారావు కంట బడ్డాడు. కుంభ వృష్టిగా కురుస్తున్న అంత వర్షంలోనూ అలాగే ఉన్నాడా సంగీతరావు? అనుకున్నారు కృష్ణారావుగారు.

పక్క గది కిటికీలోంచి సంగీతరావును తారకూడా అలాగే చూసిందన్న సంగతి కృష్ణారావుకు తెలీదు.

కిటికీ తలుపులు వేసి కృష్ణారావు మళ్ళీ పక్క మీద వాలారు.

కానీ,

ఆ రాత్రి మర్నాడుగా రూపు దిద్దుకోవటం అంతాతారగమనిస్తూనే ఉంది. తూర్పునుంచివెలుగు రేకలు ఒకటొకటిగా రావటం ఆమె చూస్తూనే ఉంది. రాత్రంతా వానకు తడిసిన సంగీతరావు ఇపుడీ ఎండకు ఎండుతాడా? ఏమిటీ పిచ్చిదనం! ఎందుకీ...

ఎందుకేమిటి—తన కోసం!


పోనీ వెళ్ళి, 'మిగతా ప్రపంచం సంగతి మన కెందుకు, పోదాం పద!' అనేస్తే అనిపించింది తారకు. కానీ ఏదో తెలీని అడ్డంకి ఆమెను ఆపేసింది. ఇలా ఈ క్షణంలో వెళ్ళితే, తన తండ్రి గుండె పగిలి చచ్చిపోతాడు. అలా కాదు...ఇంత కాలమూ కేవలం అభిమానం మాత్రమే ఉన్న తనకు ఇపుడు సంగీత రావు అంటే ఇష్టమూ ఉంది. ప్రేమా ఉంది. తన కోసం ఇంతటి దీక్ష పట్టిన యువకుడంటే ఎంతో ముచ్చటగాను ఉంది. తన్నే ఇంతగా అతను ఆకట్టుకో గలిగితే, తన తండ్రీ అతనికి లొంగి రానే వస్తాడు. ఎటొచ్చీ ఇంకొంతకాలం పట్టొచ్చు. కానీ ఆ లోగానే, ఆ మూడు ముళ్ళ ముహూర్తం రానే వచ్చేస్తే...?

తార మనసొకసారి వణికింది.

బ్రేక్‌ఫాస్ట్ ముందు కూర్చున్న కృష్ణారావుకు ఏమీ తిన బుద్ధి కావటం లేదు. ఇంటి ముందు ఇలా ఒకరు తన కన్న కూతురి కోసం కాపలా కాస్తూ ఉన్నాడంటే...ఇబ్బందిగా ఉంది. ఏం చెయ్యాలో తోచటం లేదు. ఏం చేస్తే ఈ గొడవ సర్దుమణిగి పోతుందో అర్థం కావటం లేదు. పక్కనే కుర్చీలో కూర్చుని ప్లేటుమీద స్పూన్‌తో గీతలు గీస్తున్న తారను చూసి, ''ఏమిటమ్మా ఇది!''అనేసి, టేబుల్ ముందు నుంచి లేచి వెళ్ళిపోయారు.

మధ్యాహ్నం అయ్యేసరికి సంగీతరావు చుట్టూ ఒక చిన్న గుంపు చేరింది. విషయం తెలుసుకున్న అందరూ విస్మయం చెందారు. ఆ నోటి నుంచి ఆ నోటికీ అలా అలా పాకుతూ చివరికి వూరంతా గుప్పు మంది. ఎవరో పత్రికల వాళ్ళొచ్చి సంగీత రావు ఫొటోలు తీశారు. సంగీతరావు ఏమీ చెప్పక పోయినా—''అభిజ్ఞవర్గాల కథనం'' అంటూ వార్తల్ని రాశారు. సాయంత్రానికి స్పెషల్ బేనర్లతో ఈవి నింగ్ ఎడిషన్ పేపర్లు వచ్చేశాయి. ''ప్రముఖ గాయకుని ప్రేమ దీక్ష!'' అంటూ ఆ పత్రికలన్నీ సంగీతరావు సంగీతాన్ని, ప్రేమ దీక్షను ఏకంగా పొగిడేశాయి. మాటకు కట్టుబడి ''నిలిచిన'' సంగీత రావుకు తారతో పాణిగ్రహణం జరగటమే మంచిదని ఉచిత సలహా ఇచ్చాయి. కృష్ణారావు ఇంటి ముందే సంగీతరావు కళ్ళ ముందే ఈవెనింగ్ ఎడిషన్ పేపర్లు హాట్ కేక్స్‌లా అమ్ముడు అయిపోయాయి. ఒకటో రెండో కాపీలు కృష్ణారావు ఇంట్లోకి వెళ్ళటమూ సంగీతరావు చూశాడు.

కృష్ణారావు ఆ పత్రికల్ని చూసి అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ''ఏమిటమ్మా ఇది! ఏమి టిలా అల్లరి చేస్తే ఏం బాగుంది! అతనికేం ఇదో పెద్ద పబ్లిసిటీలా బాగానే ఉంటుంది! కానీ మన సంగతేమిటమ్మా?...'' అంటూ చిర్రు బుర్రు లాడారాయన!.




తార నవ్వేసింది—''నాన్నా! మీరు ఈ వార్తల్ని సరిగ్గా చదివినట్లు లేదు. అతనంతట అతను ఒక్క వాక్యం అయినా చెప్పాడేమో ఆలోచించండి. మనం అనుకొంటున్నట్లుగానే ఇదీ అతని వ్యక్తిగత సమస్యే! ఎటొచ్చీ పేరున్న గాయకుడు కాబట్టి పత్రికలు పట్టించుకొంటున్నాయి. పైగా...ప్రేమ కోసం ఈ నిరాహార నిల్చునే దీక్షలో ఎంత న్యూస్ ఉందో చెప్పండి.''

కృష్ణారావు క్షణం ఆగి అన్నారు—''పోనీ గానీ... వెళ్ళి అతనేమైనా తింటాడేమో అడిగి, పంపించు. పంపించొద్దులే, నువ్వే తీసుకెళ్ళి ఇచ్చిరా! అలాగే ఈ దీక్ష మానెయ్యమని మరీ అడిగిరా!...''

తార పక్కున నవ్వింది—''నాన్నా! అతను అడుగు తున్నది నా చెయ్యి, నాతో పెళ్ళి! ఇపుడు వెళ్ళి నేను అది తిను, ఇది తిను అంటే ఏం బాగుంటుంది చెప్పండి. పైగా నేను...ఇంకేముందీ ఈ పత్రికలకు కావాల్సినంత న్యూస్. రేపటి పత్రికలన్నీ నా ఫొటోల తోనే ఉంటాయి కదా!''

''ఏమిటోనమ్మా ఇది, ఇలాటిది కనీ వినీ ఎరగం! ఈ సంగతే మగ పెళ్ళివారికి తెలిస్తే ఏముందీ...'' అన్నారాయన బాధతో.

తార ఏమీ అనలేదు. ఇంకా వారికి తెలీకుండా ఉండి ఉంటుందా అనుకొంది. ఆ మాట మాత్రం పైకి అనలేదు.

ఆ రోజు రాత్రీ కుండపోతగా వర్షం కురిసింది. వర్షంలో వస్తున్న మెరుపులతో బాటుగా పత్రికల వాళ్ళ ఫ్లాష్ కెమెరాలు మెరిశాయి. వర్షంలో తడు స్తున్న ప్రేమికుడిని వంద రకాల కోణాల్లోంచి ఫొటోలు తీశారు. సంగీతరావు చూస్తూ ఉండి పోయాడే కానీ వద్దనీ అనలేదు. వూర్కోమనీ అన లేదు. నిజానికి ఇది తార పెళ్ళి! తనెవరో పరాయివాడు అయినా అందులో జోక్యం చేసుకొన్నాడు. అలాగే తన సంగతిలో పరాయి వాళ్ళయిన పేపరువాళ్ళు జోక్యం చేసుకొంటున్నారు. ఇందులో నిరసన తెలి పేందు కేముంది?

ఆ మర్నాడు ఉదయం పేపర్లతోబాటు కృష్ణారావు ఇంటికి కబురు వచ్చింది—మగ పెళ్ళివారం దగ్గర్నుంచి. పేపర్లవాళ్ళు గొడవ పట్టలేకుండా ఉందని,ఇంత హంగామా జరిగాక ఇంక తాము చేయుగలిగేది ఏమీ లేదు గనుక వెనక్కు తగ్గుతున్నామనీనూ!

కృష్ణారావుకు గుండె గుబులుతో గుబేలు మంది. ఎంత సజావుగా జరగాల్సిన పెళ్ళి ఇది! ఎందు కిలా ఎదురు తిరిగింది?

పీటలమీద పెళ్ళి ఆగిపోతే, ఇంక ఈ వూళ్ళో తను తలెత్తుకొని తిరగగలడా?అసలు ఆఅవమానాన్ని తన గుండె భరించగలదా? ఉహూ, తన ఒక్కడి జీవితం మాత్రమే ఇందులో ఇన్వాల్వ్ కాలేదు. అటూ కూతురు తార...ఎంతటి అవమానం ఇది—ఎంతటి నిరాశ ఇది.

ఇలా జరగనివ్వడు తను.

జీవితంలో వోడిపోడు తను.

ఏదో ఎవరో ఒక్కడు కాదన్నంత మాత్రాన తన కూతురి పెళ్ళి ఆగిపోదు. పంతానికి పోతే తాను సైతం ఒక్కడుగు ముందే ఉంటాడు. లక్షలు, కోట్లు ఆఖరికి తను ఐ. పీ. పెట్టి అయినా కూతురి పెళ్ళి అదేముహూర్తానికి జరిపించేస్తాడు. అంతేకానీ, ఇలా ఓడిపోయి బతకటం తన వల్ల కాని పని!

అరగంట సేపు గదిలో పచార్లు చేస్తూ కృష్ణారావు తాను తీసుకున్న నిర్ణయం సరైనదే ననుకున్నాడు.

తిన్నగా వెళ్ళి తార గది తలుపు తట్టాడు.

తార తన కన్నా ఒకడుగు ముందునే ఉంది—ఒక తరం ముందు పుట్టింది కాబట్టి! 'నెవర్ లవ్ ఏ స్ట్రేంజర్' అనే నవల చదువుతూంది. జీవితం ఒక పక్క పుట్టి మునిగి పోతూంటే, ఎంతటి నిర్వికారంగా ఉంది! జీవితం పట్ల ఎంత ఉదాసీన భావం ఈ కాలం పిల్లలకు!

అయినా ఇంత గుండె నిబ్బరం ఎక్కడిది! ఎంతైనా తార తన కూతురు. తననేది కాదనదు.

"చెప్పండి, డాడీ!" అంది తార, నవల పక్కన పడేస్తూ.

"ఒక్కటి ఆలోచించా, తల్లీ! నువ్వు వూఅంటే"

"చెప్పండి."

"తెలిసిందా నీకు—మగపెళ్ళి వారు ఈ సంబంధం వదులుకుంటున్నట్లు కబురు పెట్టారు. ఇది వాళ్ళకు తలవంపులు కాదేమో కానీ, నాకు అవును. అయినా నే నేం చేతులకు గాజులు తొడిగించుకో లేదు. ఆ సంగతే చెప్పదలచుకున్నాను."

తారకు భయం వేసింది—ఏం జగుతుందోనని! కొంపదీసి సంగీతరావుపై పోలీసు కేసు పెట్టడు కదా! ఇంతకాలం అతనూ గొప్ప వి. ఐ. పి. అని పోలీసులూ వూరుకుంటున్నారు. ఇప్పుడు తన తండ్రి కేసు పెడితే, పోలీసులు వూరుకునే అవకాశం లేదు. అలా జరగదు కదా!

"చెప్పండి, ఏం చేస్తారో!" అంది కీడు శంకిస్తూనే తార.

"నువ్వు వూ అంటే అదే ముహూర్తానికి వేరే కుర్రాడిని వెతికి తెస్తానమ్మా! ఆస్తి అంతా నాశనం కానీ, నీ జీవితాన్ని దెబ్బ తిననీను!" అన్నాడు



—డి. దండపాణి

కృష్ణారావు.

తార ఉలికి పడింది. వేరే కుర్రాడు దేనికీ? ఇంటి ముందే ఉన్న సిరిని కాదనటం దేనికి?

నెమ్మదిగా అదే అంది, భయపడుతూ.

కృష్ణారావు ఉలికి పడ్డాడు—ఇంత రభస చేసిన కుర్రాడితో. కులం కాదు, మతం కాదు. ఏదో అమ్మాయిని కోరుతున్నాడుతప్ప ఇంకేముంది అర్హత!

"ఆ ఒక్క అర్హతా చాలదా, డాడీ?" అంది తార.

కృష్ణారావు చాలాసేపు ఆలోచించాడు. చివరకు నిర్ణయించుకున్నాడు.

"నీ ఇష్టమే కానీమ్మా!" అలా అంటూనే ఇంటి బయటకు నడిచాడు.

అరగంట తరవాత ఇంట్లోకి నడుస్తున్న సంగీతరావునూ, కృష్ణారావును పై కిటికీనుంచి తృప్తి తీరా చూసింది తార. సంగీతరావును చూస్తూంటే తారకు ముచ్చట వేసింది. తన కోసం—కేవలం తన కోసం గదా ఇంత తపన పడ్డాడనే అహంకూడా ఆమెలో తలెత్తింది.

పెళ్ళయిపోయింది.

"ప్రముఖ గాయకునికి విజయం" అని ఒకపత్రిక అంటే—"ప్రేమ గెలుస్తుందన్న చరిత్ర సత్యం!" అని మరో పత్రిక రాసింది. తార ఆ పత్రిక లన్నిటిలోనూ తమ ఇద్దరి ఫోటోలూ తనివి తీరా చూసుకుంది.

కానీ—

పెళ్ళి తరవాత రోజున పెద్ద రిసెప్షన్ జరిగింది ఆ రిసెప్షన్‌కు వచ్చిన అందరూ సంగీతరావును పాట పాడమని కోరారు. ఆఖరికి తారకూడా అడిగాక సంగీతరావు పాట పాడాడు.

కానీ—

అంతటి శుభ షమయంలో సంగీతరావు విషాద గీతాన్నే ఎందుకు ఆలపించాడో మాత్రం తారకు అర్థం కాలేదు. అంతేకాదు. ఆ తరవాత ఎప్పుడూ ప్రేమగీతాలు ఆలపించక కేవలం విషాదగీతాల్నే పాడేందుకుసంగీతరావు ఎందుకు నిర్ణయించుకున్నాడో కూడా ఆమెకు అర్థం కాలేదు.

ఒక నిర్దిష్ట లక్ష్యం కోసం ఎన్నో అవస్థలు పడి, ఎన్నో కష్టాల కోర్చి, విషాదంతో కలిసి జీవించాక ఆ లక్ష్యాన్ని చేరుకున్న కొందరికి ఆ సంతోషంకన్నా అప్పటివరకు జీవితంలో అలుముకున్న విషాదమే అధికంగా కనిపిస్తుందన్న సంగతి తారకు ఎవరూ చెప్పలేదు.

సంగీతరావు తార కోసం శ్రమించాడు. పట్టుదలతో తారను పొంద గలిగాడు. కానీ అప్పటికే అతని జీవితాన్ని అధికంగా విషాదం కమ్మివేసిందన్న సంగతి కూడా తారకు తెలీదు. ఆ విషయంకూడా ఎవరూ ఆమెకు చెప్పరు.

అందుకే తమ పెళ్ళి అనే యుగళగీతంలో తనకు సంతోషం దర్శనం ఇస్తూంటే సంగీతరావుకు మాత్రం విషాదమే ఎందుకు దర్శనం ఇస్తూందో తార ఎంత ప్రయత్నించినా అర్థం చేసుకోలేక పోయింది. ★